# పద్మభూషణ్ డా॥ బోయి భీమన్న జీవితం –సాహిత్యం

(రెండు రోజుల జాతీయ సదస్సు (ఆన్‌లైన్) ప్రత్యేక సంచిక)

## 17 & 18 తేదీలు, ఆగష్టు 2022


సంపాదకులు & సదస్సు సంచాలకులు

ఆచార్య జి. బాలసుబ్రమణ్యం

ప్రిన్సిపాల్, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ ఆర్ట్స్ కళాశాల

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం

అనంతపురము. -515003

సెల్ : 9490194780

సహ సంపాదకులు & సదస్సు సమన్వయకర్త

డా॥ బత్తల అశోక్‌కుమార్

అధ్యక్షులు, శ్రీశ్రీ కళావేదిక ఎస్కేయూ శాఖ

అనంతపురము. -515003

సెల్ : 9490194780


**సంపాదకమండలి**


డా॥ పతికి రమేష్ నారాయణ

శ్రీ గుత్తా హరిసర్వోత్తమనాయుడు



నిర్వహణ

శ్రీశ్రీ కళావేదిక ఎస్కేయూ శాఖ, అనంతపురము

మహాబోధి సాహిత్య వేదిక, అనంతపురము

# విషయ సూచిక


1. బోయిభీమన్నగారి "పాలేరు నుంచి పద్మశ్రీ" వరకు జీవితచరిత్ర సామాజిక దృక్పథం - డా॥ నందమూరి లక్ష్మీపార్వతి 1

2. తెలుగు సాహితీ సంపద - బోయి భీమన్న - ఆచార్య ఎం. రామనాథం నాయుడు 5

3. బోయి భీమన్న రచనా వైవిధ్యం- పాలేరు నాటకం - డా॥జె.వి.చలపతిరావు 9

4. దళిత జీవన చిత్రణ "పాలేరు" - బండారి ప్రేమ్‌కుమార్ 14

5. 'భీమ్‌రావ్' బాటలో భీమన్న రచనలు - దాసన్నగారి కృష్ణమూర్తి 17

6. నఖక్షతాలు చెబుతున్న తాత్త్వికత - ఓ. కోయిల నవీన్ 21

7. బోయి భీమన్న... మానవత్వం మూర్తీభవించిన మహనీయుడు - జి. ఈశ్వరీ భూషణం 26

8. ప్రజా హృదయాలను మేల్కొలిపిన మహనీయుడు - 'కళా ప్రపూర్ణ' బోయి భీమన్న - ఎస్. అమ్మూ బమ్మిడి 29

9. డా॥ బోయి భీమన్న జానపదుని జాబు - శ్రీమతి చిట్టే సిద్దే లలిత 32

10. బోయి భీమన్న కవిత్వం - హేతువాదం - డా॥ దార్లపూడి శివరామకృష్ణ 35

11. బోయి భీమన్న రచనల్లో సామాజిక చైతన్యం- బి.క్యాథరీన 38

12. నఖక్షతాలు చెబుతున్న తాత్త్వికత - డా॥ శ్రీనివాస్ అంకే 44

13. డా॥ బోయి భీమన్నగారి గుడిసెలు కాలిపోతున్నై... సామాజిక దృక్పథం డా॥ బూర్గుల స్వరూప 48

14. బోయి భీమన్న సాహిత్యం - వ్యక్తిత్వం - డాక్టర్ బి.చక్రవర్తి 50

15. పాలేరు నాటకం - వైయక్తిక విముక్తి -కాళేశ్వరం కృష్ణమూర్తి 54

16. రాగవాసిష్ఠం - పాత్రల పరిశీలన - డా॥ఎం.లక్ష్మయ్య 59

17. బోయిభీమన్న కవిత్వం - దళితవాదం - కోష్టు గోవిందరావు 63

18. డా॥బోయి భీమన్న అభిమతం-అంబేద్కర మతం - డా॥మల్లెపోగు మాదన్న 69

19. బోయి భీమన్న - పిల్లీశతకం సామాజిక స్పృహ - నిదాన కవి నీరజ 70

20. పాలేరు నాటకం - సాంఘిక న్యాయం - డా॥ పి. కమల సుధారాణి 75

21. బోయి భీమన్న గారి పాలేరు నాటకం - సంభాషణా శిల్పం - డా. పట్టపు. శివకుమార్ 77

22. తడి ఆరని "ఒంటరిగొంతు" - సద్మెక లలిత 83

23. రాభీలు - వ్యక్తిత్వ వికాసము- డా॥ సూరపరాజు వసంత కుమారి 86

24. డా॥ బోయి భీమన్న సాహిత్యం-సామాజిక దర్పణం - పోతురాజు దుర్గాదేవి 91

25. పాలేరు నాటకం - సామాజిక చైతన్యం - నండూరి అనంతలక్ష్మి 94

# 16. రాగవాసిష్ఠం - పాత్రల పరిశీలన

డా॥ ఎం. లక్ష్మయ్య, తెలుగు అధ్యాపకులు, సి.ఎస్.ఎస్.ఆర్ & ఎస్.ఆర్.ఆర్.ఎం. డిగ్రీ & పి.జి కళాశాల, కమలాపురం, కడప జిల్లా, సెల్: 9492495437

**పరిచయం:-** భీమన్న సెప్టెంబర్ 19 , 1911 సంవత్సరంలో తూర్పు గోదావరి జిల్లా మామిడికుదురు గ్రామంలో నాగమ్మ, పుల్లయ్య దంపతులకు జన్మించాడు. పుల్లయ్యకు పాండవుల లాగా ఐదుగురు కుమారులు, ఒక కుమార్తె జన్మించారు. ఐదుగురు కొడుకులకు ధర్మరాజు, భీముడు, అర్జునుడు, నకులుడు, సహదేవుడు అనే పేర్లు పెట్టడం జరిగింది. అందులో రెండవ వాడే మన భీమన్న. భీమన్న 1935 సంవత్సరంలో బి.ఎ పాసయ్యాడు. 1937లో బి.ఇడి పూర్తి చేస్తాడు. అతడు సుమారు 70 వరకు పుస్తకాలు రాసినట్లు తెలుస్తుంది. అందులో పద్య, గేయ, రచనలతో పాటు నాటకాలను కూడా రాశాడు. ఎన్నో పుస్తకాలకు పీఠికలను కూడా రాశాడు. ఆకాశవాణిలో ప్రసారం కోసం అనేక భావగీతాలను రాశాడు. అంబేద్కర్ రాసిన కొన్ని రచనలను తెలుగులోకి అనువాదం చేశాడు. వాటితో పాటు అంబేద్కర్ వ్యక్తిత్వాన్ని, జీవితాన్ని గురించి కీర్తిస్తూ మరికొన్నిరచనలు రాసినట్లు తెలుస్తుంది. భీమన్న రాసిన " జయ జయ జయ అంబేద్కర " అనేది దళితులకు జాతీయ గేయమై నేటికీ ఊరూరా ప్రార్థనా గీతంగా మారుమోగుతోందని డా॥ దార్ల వెంకటేశ్వరరావు వ్యాఖ్యానించారు.

భారతదేశంలోని భిన్నత్వంలో ఏకత్వంలాగా భీమన్న రచనల్లోనూ ఆ లక్షణం కనిపిస్తుంది. అతడు కుల మతాల కంటే మనవత్వాన్నే ఎక్కువగా ఆశించిన కవి అని చెప్పవచ్చు. ఈయన రచనలకు చాలా పురస్కారాలు వచ్చాయి. 1971లో ఆంధ్ర విశ్వకళా పరిషత్ వారి కళాప్రపూర్ణ బిరుదు పొందాడు. 1973 సంవత్సరంలో పద్మ శ్రీ పురస్కారం, 1975 వ సంవత్సరంలో గుడిసెలు కాలిపోతున్నాయి రచనకు కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు వచ్చింది. 1976లో కాశీ విద్యాపీఠం వారి నుండి గౌరవ డాక్టరేట్ పొందాడు. అలాగే నాగార్జున విశ్వవిద్యాలయం నుండి కూడా గౌరవ డాక్టరేట్ పొందాడు. 1991లో తెలుగు విశ్వవిద్యాలయం వారి విశిష్ట పురస్కారం లభించింది. 2001లో పద్మ భూషన్ అవార్డు, 2004లో తంగిరాల కృష్ణ ప్రసాద్ స్మారక అవార్డు పొందారు. భీమన్న రాసిన పౌరాణిక సాంఘిక సాటకం రాగవాసిష్ఠంలోని పాత్రల గురించి పరిశీలించడమే ఈ వ్యాసం యొక్క ముఖ్య ఉద్దేశ్యం. రాగవాసిష్ఠం నాటకంలో 12 రంగాలు ఉన్నాయి. ఇందులో వసిష్ఠుడు, అరుంధతిల ప్రేమ వృత్తాంతమే ప్రధాన పాత్రలుగా ఉన్నాయని చెప్పవచ్చు.

వేదవనంలోని ఒక ఆశ్రమంలో ఊర్వశి వసిష్ఠుని బాగోగులను ప్రాచీనుడు అనే మునిబాలునికి ఒప్పజెప్పి అక్కడ వదిలి వెల్లుతుంది. వేదవనంలో ఇంకొక పక్క యమునానది ప్రవహిస్తుంది. దానికి సమీపంలోనే పచ్చని పందిళ్ళతో, సువాసనలు వెదజల్లే పువ్వులతో కూడిన లతలు అల్లుకుని ఉన్నాయి. అక్కడే మరొక ఆశ్రమంలో అరుంధతి, ఆమె చెల్లెలు సంధ్య, తమ్ముడు శివోహం నివసిస్తున్నారు. అరుంధతి మాతంగ వంశానికి చెందిన అందమైన స్త్రీ మూర్తి. ఒక రోజు ఉదయం సంధ్య ఆశ్రమం నుండి పాటలు పాడుతూ బయటకు వెళుతుంది. ఆమె పాటలను ప్రకృతి సహితం వింటుంది. అప్పుడు వసిష్ఠుడు అటుగా వస్తాడు. సంధ్య పాడే పాటను వింటాడు. నిన్నలేని రమణీయం ప్రకృతికి నేడెక్కడి నుండి వచ్చిందని అనుకుంటు ముందుకు వెలుతాడు. అంతలో అరుంధతి సంధ్యను పిలుస్తుంది. సంధ్య ఎర్రని దుస్తులు ధరించి, ఉదయపు సూర్యునిలా నిగనిగలాడుతు ఉంది.

వసిష్ఠుని చుట్టు తిరిగి పాడుతూ వెళ్తుంది. దూరంలో నుండి ఇంకొక స్త్రీ గొంతు సంధ్య అని వినిపిస్తుంది. ఈమె పేరు సంధ్య ఆమె ఎవరు? ఆ శబ్దం వినబడిన వైపు వేగంగా వెలుతాడు. అరుంధతి యమునా నది స్నానఘట్టంలో జారి నీళ్ళలో పడింది. అది గమనించిన వశిష్ఠుడు వెంటనే నదిలోకి దూకి ఆమెను బయటకు తీసుకొస్తాడు. ఇద్దరి దుస్తులు కూడా తడిసిపోయాయి. అదే సమయంలో సంధ్యా అక్కడకు వస్తుంది. అక్కా, అక్కా అని గట్టిగా పిలుస్తుంది. మీ అక్కకు ఏమి కాదలే అని వశిష్ఠుడు

చెబుతాడు. అంతలోనే అరుంధతి కళ్ళు తెరుస్తుంది. తన కళ్ళకు ఎదురుగా ఉన్న సంధ్యను చూస్తుంది. ఆ తర్వాత పక్కనున్న వశిష్ఠున్ని చూస్తుంది. తన అక్కను కాపాడినందుకు మీ ఋణం ఎలా తీర్చుకోవాలి మునివర్య అని సంధ్య నమస్కరిస్తుంది. వశిష్ఠుడు అంత పెద్ద మాటలెందుకులే అంటాడు. అరుంధతి, సంధ్యను ఆశ్రమానికి వెళ్దాం పదా అంటుంది. వశిష్ఠున్ని కూడా తమ ఆశ్రమానికి ఆహ్వానిస్తుంది. కాని వశిష్ఠుడు తన స్నేహితుడు పిలుస్తున్నాడని రేపు వస్తానని వెలుతాడు. వశిష్ఠుడు వెళ్ళే దారివైపే అరుంధతి, సంధ్య చూస్తున్నారు. అరుంధతికి స్నానఘట్టంలో జరిగిన దుస్సంగటన, ఆ తర్వాత అపూర్వ మధురానుభూతి ఆమెను అయోమయం చేశాయని చెప్పవచ్చు. నిజానికి అరుంధతి ఒక బ్రాహ్మణ అమ్మయిలా చక్కగా అందంగా ఉంటుంది. ఆమె అందానికి వశిష్ఠుడు ముగ్ధుడౌతాడు. అలా వశిష్ఠుడు ఉదయ సంధ్యా సమయంలో సంధ్య పాడే పాటలు విని, అరుంధతితో మాట్లాడి వెళ్ళేవాడు. వశిష్ఠుడి ఆశ్రమంలో అతనితోపాటు , కులగిరి కూడా ఉంటాడు. అతడు ఎంత తపస్సు చేసినా ఒక దేవకన్య కూడా కనపడదు అంటాడు. అంతలో అరుంధతి తమ్ముడు శివోహం బిగ్గరగా , పులిలాగా అరుస్తాడు. కులగిరి భయపడి శివోహం దగ్గరకు వస్తాడు. ఎవరు నీవు ఎప్పుడు చూడలేదని అడుగుతాడు. తనది మాతంగ వాటిక అని చెబుతాడు. అప్పుడు కులగిరి దూరంగా ఉండు నిన్ను తాకకూడదు. ఇక్కడే పులినోటికి ఆహారమై చస్తాను కాని నిన్ను తాకనని చెబుతాడు. ఇప్పుడు నీవు ఎలా వెళ్తావో చూస్తానంటాడు శివోహం. నీకు దండంపెడతాను నన్ను వదిలిపెట్టమని చెబుతాడు. సరే అయితే వెళ్ళు అని శివోహం అంటాడు.

అరుంధతి తన ఆశ్రమం సమీపంలోని వివిధ పూలతో ఒక దండను తయారు చేసింది. అరుంధతి పాదాల గుర్తులను గమనిస్తూ వశిష్ఠుడు ఆమె ఆశ్రమంలోకి వెళుతాడు. అప్పుడు అరుంధతి వశిష్ఠున్ని చూసి ఆశ్చర్యపోతుంది. తాను పరమేశ్వరుడనుకూంటినని చెబుతుంది. నేను పరమేశ్వరుడనైతే నీచేతిలో ఉండేది తెల్లనితాచునా అంటాడు. తమరు పరమేశ్వరుడైతే ఫణిమాల, మానవుడైతే మణిమాల, పూజలలో పుష్పమాలవుతుంది కదా అంటుంది అరుంధతి. నీవు మానవత్వం నుండి దివ్యత్వానికి పురోగమిస్తు దారి మధ్యలో ఉన్నారు అందుకే ఈ మాల పుష్పమాలగా నిన్ను చేరిందని అతని మెడలో వేస్తుంది. వశిష్ఠుడు ఆ దండను తిరిగి ఇస్తాడు. ఆమె మళ్ళీ దండను అతడి మెడలోనే వేస్తుంది. వశిష్ఠుడు అందుకు ప్రత్యామ్నాయంగా నీకు ఏది కావాలని అడుగుతాడు. అతడి తులసి మాలను ప్రతిగా ఇవ్వమంటుంది. అప్పుడు వశిష్ఠుడు తనను రాగిని చేసి నీవు విరాగిణి అవుతావా అంటాడు. రాగం జీవ స్వరూపం, విరాగం బ్రహ్మ స్వరూపం. అరుంధతికి తన మెడలోని జపమాలను తీసి ఆమె మెడలో వేస్తాడు. జపమాలను ఆమె తేజోవతి అవుతుంది. అప్పుడు వారిద్దరి మీద ఆశ్రమంలోని వృక్షలతాదులన్ని పువ్వులను విసిరాయి. శుకపికాదులు కళ్యాణ గీతాలతో గానం చేశాయి. దూరంలో సంధ్య పాట వినిపిస్తుంది. క్రమంగా చీకటై పోతుంది.తనకు నూతన దృక్పతాన్ని , చైతన్యాన్ని కల్గించి, నవనూతన జీవిగా రూపొందిన నీ ప్రేమ శక్తికి నేను సర్వదా కృతజ్ఞుడనయ్యానంటాడు. పుట్టుకతో నీవు పూజా పూష్పానివి. నీవు లభించడం ఒక అదృష్టంగా భావిస్తున్నానని చెబుతాడు. ఇప్పుడు మనం జీవ బ్రహ్మలం. ఈ విశ్వం నాట్యరంగం అంటాడు వశిష్ఠుడు. అప్పుడు సంధ్య వారిద్దరి మధ్యకు చేరి మీరు సతి సాంబశివులులాగా ఉన్నారని తన మనసులోని మాటను వ్యక్తపరుస్తుంది. అప్పుడు ప్రాచీనుడు ప్రత్యక్షమవుతాడు. సతీ సాంబశివులే నాకు ప్రత్యక్షమైనారు. నా తపస్సు నేటికి ఫలించిందని , ఆదిదంపతులకు సాష్టాంగ నమస్కారం చేస్తాడు. నిజంగానే వారు అలా ఉన్నారేమో! అంతకు ముందు సంధ్య కూడా ఆ మాట అన్నది. అప్పుడు అరుంధతి వశిష్ఠులు దిగ్భ్రాంతులౌతారు. అతడెవరో అరుంధతికి తెలియదు. ప్రాచీనుడు ఎవరో వశిష్ఠునికి తెలుసు. ప్రాచీనుడు పెద్దవాడు, ఆచార పరుడు, కఠిన వ్రతుడు. అతన్ని చూసిన వశిష్ఠుడికి పై ప్రాణాలు పైనే పోయాయంటే అతిశయోక్తి కాదు. అప్పుడు వశిష్ఠుడు మహర్షి నేను వశిష్ఠున్ని మీరు నన్ను క్షమించాలంటాడు. ప్రాచీనుడు ఈ తాపస కన్య ఎవరని వశిష్ఠున్ని అడుగుతాడు. ఆమె పేరు అరుంధతి అని చెబుతాడు. ప్రాచీనుడు హరి హరీ ఆమె అంటరాని, చూడరాని చండాలకన్య అని చెప్పి వేగంగా వెలుతాడు. ఆ సమయంలో ప్రాచీనుడి మాటలకు అరుంధతి మనోస్థైర్యాన్ని కోల్పోతుంది. వశిష్ఠుడు ఆ మహర్షి వెంట

వేగంగా తన సందేహాన్ని నివృత్తి చేసుకోవడానికి వెలుతాడు. అంతలో సంధ్య వచ్చి తన అక్కను ఆశ్రమానికి తీసుకెలుతుంది.

వశిష్ఠ ఎంత పతనమైపోయావు. పాపం చేసి పశ్చాత్తాప పడలేనంతటి హీన స్థితికి దిగజారి పోయావు. స్త్రీ స్నేహం తపో వృక్షానికి చీడపురుగు, ఆధ్యాత్మికానందానికి విషసర్పంలాంటిదని ప్రాచీనుడు చెబుతాడు. స్త్రీ చీడపురుగు, విష సర్పం ఐతే సృష్టిలో అసలు స్త్రీత్వమే తేకుండా పోయేదికదా? శుద్ధ నిర్గుణ పరతత్వంతో సుందరమైన చైతన్య శక్తి స్త్రీయే కదా. నేను దర్శిస్తున్న ప్రేమ జ్యోతిని నీవు కూడా దర్శించగలవు. ప్రేమోపాసకుడు కానివాడు దైవోపాసకుడు కూడా కాలేడంటాడు వశిష్టుడు. చివరిసారిగా చెబుతున్న వశిష్ఠా ఆమెను వదులుకో. నీ మార్గానికి నేను అడ్డురాను, పైగా నీకు సహాయపడతాను. మనం మిత్రులం. అయినా ఆర్యజాతి సంరక్షకులం. సమిష్టి క్షేమం ముందు వ్యక్తిగత ప్రయోజనం తృణప్రాయం. ఇప్పుడు నీ నిర్ణయం మీదనే ఆర్య జాగి భవిష్యత్తు ఆధారపడింది. నీచజాతి కన్యతో పవిత్రమైన ఆర్యజాతిని సంకరంచేసి సర్వ నాశనం చెయ్యదలిచావా? ప్రశాంతంగా ఆలోచించి, సమాధానం చెప్పు. తొందర ఏమీ లేదు. అనాలోచితంగా, క్షణాలపై ఉద్రేకంలో పరిష్కరించరాదు. సమగ్రంగా పరిశీలించు, స్వార్థానికి కళ్ళెం వేసి, త్యాగాన్ని ముందు రానివ్వమని ప్రాచీనుడు చెబుతాడు. కులగిరి ఊర్వశీ పుత్రుడనిపించుకోకయ్యా వశిష్ఠా ఎలాంటి వాడవు ఎలా అయిపోయావంటాడు.

జనని ఊర్వశి నీ రక్షణ భారాన్ని నాపై పెట్టింది కాబట్టి నీకు చెబుతున్నాను. నీవిప్పుడు యుక్తవయస్కుడవు. సర్వస్వతంత్రుడవు. వివేకశాలివి. యమనియమాది గుణవంతుడవు. యవ్వనం పాల పొంగులాంటిది. ప్రపంచానుభవంలేని యౌవనారంభం పెనుతుఫానులో విడువబడ్డ నౌక వంటిది. మిత్రుడు చుక్కాని పట్టినప్పుడే అది ఒక ఆశ్రమం చేరగలదు.ఒక మిత్రునిగా తన సలహాను పాటించమని ప్రాచీనుడు వశిష్ఠున్ని కోరుతాడు. ఒకవేళ నీకు వివాహం చేసుకోవాలనిసిస్తే మన కులంలోనే చాలా మంది బ్రాహ్మణ అమ్మాయిలు ఉన్నారు కదా వారిని చేసుకో. కాని నీవు అరుంధతిని చేసుకొని మన ఆర్య జాతిని భ్రష్టుపట్టించొద్దని చెబుతాడు. ఇదిగో ఇసుక ను ఇస్తున్నాను ఈ ఇసుకను ఎవరైతే నీకు అన్నంగా వడ్డిస్తారో ఆమెనే నీకు భార్య అవుతందని ప్రాచీనుడు చెబుతాడు. ప్రాచీనుడు ఇచ్చిన ఇసుకను వశిష్ఠుడు అరుంధతి దగ్గరకు తీసుకెళ్ళాలనుకుంటాడు. ఒక వేల ఆ ఇసుకను అరుంధతి చేస్తే అన్నంగా మారకపోతే అప్పుడు వేరే కన్యను వివిహం చేసుకోలేనుకదా అని ఇసుకను పారవేస్తాడు. వశిష్ఠుడు ఎటూ వెళ్ళలేక ఆశ్రమం వదిలి అరణ్యంలో తిరుగుతుంటాడు.

అరుంధతి వశిష్ఠుని కోసం తీవ్రమైన తసస్సు చేస్తున్నది. సంధ్య తన అక్క పరిస్థితిని తెల్పడానికి వశిష్ఠుని కోసం తిరగని ఆశ్రమం లేదు. అరుంధతి తపస్సు వల్ల సాదారణ జనులకు కరువు కాటకాలు వస్తాయి. ప్రజలు ఆకలి దప్పులకు అలమటిస్తున్నారు. అంతలో గోష్పాదం, కుంబోధరం అనే వారు ఆకలి దప్పులతో అక్కడకు వస్తారు. వారితో సంధ్య తమ ఆశ్రమంలో ఉంటే మూడు పూటలా భోజనం దొరుకుతుందని చెబుతుంది. వాళ్ళందరూ బ్రహ్మ లోకానికి బయలుదేరారు. ఆకలిదప్పులు తీర్చలేని నీవు తమను ఎందుకు పుట్టించావని అడగడానికి వెలుతున్నారు. వాళ్ళతో పాటు కులగిరి కూడా వెళ్తాడు. అప్పుడు బ్రహ్మ మనుష్యులందర్నీ సమానంగా సృష్టిస్తున్నాను. మీలో మీరు భేదాలు పెట్టుకొని ఒకళ్ళనొకళ్ళు హింసించుకుంటున్నారు. ఆ పాపం వల్ల ఇలా విపత్తులు దాపురిస్తున్నాయి. నేనేమి చేయలేను మీరు పోయి విష్ణువుని ఆశ్రయించండని చెబుతాడు.

తర్వాత వాళ్ళు అక్కడి నుండి వైకుంఠానికి వెలుతారు. వైకుంఠంలో శ్రీమహావిష్ణువు చెంచులక్ష్మి సమేతుడై ఉంటాడు. ఆయనతో వారి ఆకలిదప్పుల గురించి విన్నవించుకుంటారు. అప్పుడు శ్రీహరి అరుంధతి అనే కన్య ఘోర తపస్సు చేస్తున్నది. మీరు పరమశివుని దగ్గరకు వెళ్ళితే శుభం కల్గుతుందని తెలియజేస్తాడు. వాళ్ళు అక్కడి నుండి పరమేశ్వరుని నగరమైన కైలాసానికి వెళ్తారు. కాని అక్కడ పరమేశ్వరుడు ఉండడు. అప్పటికే అరుంధతి ఆశ్రమానికి బయలుదేరాడు.

వశిష్ఠుడు అరుంధతిని తలచుకుంటు బాధపడుతుంటాడు. తనకు దిక్కు మృత్యువే అని ఓ మృత్యువా నన్ను తీసుకపో అంటాడు. అప్పుడు పరమశివుడు ప్రత్యక్షమై మరణం ఎవరికి బాబు అని అడుగుతాడు. తనకే అని వశిష్ఠుడు చెబుతాడు.

తర్వాత పరమశివుడు వ్యక్తి, సంఘం, పరిస్థితిని, ఆంతరంగిక జాడ్యాన్ని తొలగించుకుని, బాహ్య బంధాలను తెంచుకొని ముందుకు దూకడమే చైతన్యుడి లక్షణం అని చెబుతాడు. మంచి చైతన్యం ఉన్న యౌవ్వనం నీది. నీ పురోగతిని అడ్డుకున్నదెవరు పదా పోదాం నీవెక్కడికి పోతున్నావో చెప్పు అక్కడికి నేను వస్తానని చెబుతాడు. తనను జాత్యాహంకారం సర్వనాశనం చేసిందని వశిష్ఠుడు జవాబిస్తాడు. అప్పుడు పరమశివుడు పిచ్చివాడా భారతదేశంలో ఆర్య, అనార్య భేదం కలదా? ద్రావిడులు, ఆర్యులు ఒకే జాతికి చెందినవారుకాదా! వారు దితి, అదితుల సంతానం కాదా. పరిసరాలలో ప్రకృతి తెచ్చిన మార్పులే దానికి కారణమంటాడు. ఇప్పుడు మించిపోయిందేమిలేదు కుమారా! అజ్ఞానంతో చేసిన తప్పును సుజ్ఞానంతో సరిదిద్దుకోవచ్చు. దానిని పశ్చాత్తాపంతో తుడిచివెయ్యవచ్చు. పొరపాటు చెయ్యడం మానవ లక్షణమే. అది తెలిసిన తర్వాత వెంటనే దిద్దుకోక పోవడం పశులక్షణం. నీ కోసం ఆమె ఎంత పరితపిస్తోందో కదా! మహా తపస్విని ఆ అరుంధతి. స్వామి మాటలు విన్న వశిష్ఠుడు వెంటనే అరుంధతి కోసం వెళ్తాడు. అంతలో సంధ్య పాట పినిపిస్తుంది. సంధ్య పరమశివున్ని చూసి నమస్కరిస్తుంది. గోష్పాదం, కుంభోదరం శివుని దగ్గరకు వస్తారు. అప్పుడు శివుడు స్థితిని బట్టి సృష్టి, సృష్టిని బట్టి స్థితి ఉంటుంది. ఆ రెండింటికి సమన్వయం కుదరనినాడు నేను జోక్యం చేసుకుంటానంటాడు. బ్రహ్మ, విష్ణువుల తప్పులను సరిదిద్దే లయకారున్ని నేనే, పతివ్రతల దగ్గరకు వెళ్ళండి మీకు బిక్ష దొరుకుతుందని పరమశివుడు వారికి చెబుతాడు. శివుడు సంధ్య వెంట అరుంధతి దగ్గరకు వస్తున్నారు. మార్గ మధ్యలో ప్రచీనుడు కన్పిస్తాడు. అతనికి పరమేశ్వరుడు మానవ జాతి అంతా కశ్యప సంతానమేనని ఉపదేశిస్తాడు.

వశిష్ఠుడు తపస్సు చేస్తున్న అరుంధతి దగ్గరకు వస్తాడు. ఆమెతో పాటు నిలబడి తపస్సు చేస్తాడు. శివుడు కూడా అక్కడకు చేరుకుంటాడు. శివుడు వశిష్ఠున్ని వరం కోరమంటాడు. అతడు తనకు అరుంధతిని అగ్నిసాక్షిగా ఇవ్వమంటాడు. అప్పుడు పరమేశ్వరుడు అరుంధతి, వశిష్ఠులను దీవించి, ఇద్దరిని కలిపి ఆశీర్వదీస్తాడు. అరుంధతి తపస్సుకు మెచ్చి నక్షత్ర మండలంలో శాశ్వత స్థానాన్ని వరంగా ఇస్తాడు. లోకంలో ప్రతి నూతన దంపతులు ముందుగా నీకు నమస్తరించి నీ ఆశీస్సులు పొందుతారు. నీవు వైదిక భారతీయతకు మాతవు కాగలవని దీవించి వెలుతాడు. ఈవిధంగా అరుంధతి నేటి సమాజానికి ఆదర్శ మూర్తిగా నిలిచిందని భావించవచ్చు.

ఆధార గ్రంథాలు

1.రాగవాసిష్ఠం – బోయి భీమన్న
2.డా.బోయి భీమన్న సమగ్ర సాహిత్యం(1 సంపుటం)– తెలుగు విశ్వవిద్యాలయం.